క్లుప్తంగా

వివాహ వేడుకకు హాజరైన మంత్రి రాజా



రాజమహేంద్రవరంలో వధూవరులు విప్పర్తి నిఖిల్‌కృష్ణ, దివ్య దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి దాడిశెట్టిరాజా

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, అంజలి దంపతుల కుమారుడు నిఖిల్‌కృష్ణ వివాహం రాజమహేంద్రవరంలోని చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మీ గార్డెన్స్‌లో శనివారం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా హాజరై వధూవరులు నిఖిల్‌కృష్ణ, దివ్యలను ఆశీర్వదించారు.

బాధిత కుటుంబానికి చేయూత



అల్లిపూడిలో బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి నాయీ బ్రాహ్మణ సంఘం అండగా నిలిచింది. బాధితుడు ఎర్రవరం సత్యనారాయణ కుటుంబ సభ్యులకు శనివారం కాకినాడ జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కింతాడ సత్యనారాయణ, రాష్ట్ర సేవాసంఘ మహిళా అధ్యక్షురాలు కాపారావు శ్రీదేవి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. నాయీబ్రాహ్మణ సంఘం కాకినాడ టౌన్ అధ్యక్షుడు బీమనపల్లి వీరబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ స్వయంవరపు శ్రీనివాసరావు, తుని సంఘ అధ్యక్షుడు మాచవరపు బాబ్జీ పాల్గొన్నారు.

అన్నదానం

కిర్లంపూడి: చిల్లంగి శ్రీనివాసనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలని స్కిల్ హబ్‌లో వెబ్ డెవలపర్, ఎలక్ట్రికల్, హోమ్ అప్లయిన్స్ సర్వీసింగ్, సేల్స్ అనే కొత్త కోర్సులు ప్రవేశపెట్టినట్టు కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రనాయుడు శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా విద్యార్థులకు ఈ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వెబ్ డెవలపర్ బ్యాచ్ మొదలు ప్రారంభమైందన్నారు. హోమ్ అప్లయిన్స్ సర్వీసింగ్ బ్యాచ్‌కు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కళాశాలలో స్కిల్ కో ఆర్డినేటర్ సత్యవతి, వెబ్ డెవలపర్ ట్రైనర్ మెర్సీ ప్రసాద్, హోమ్ అప్లయిన్స్ ట్రైనర్ చంటిబాబులను సంప్రదించాలని సూచించారు.

సత్తెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

కిర్లంపూడి: మండలంలో పాతరాజుపాలెంలో పునర్నిర్మించిన సత్తెమ్మతల్లి ఆలయంలో శనివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ పండితుడు తేజోమూర్తుల జగదీశ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గణేశుల రాంబాబు, గణేశుల లక్ష్మబాబు, మురళీ, గొడే ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రత్తిపాడు రూరల్: పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని పాడి రైతులకు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చిక్కం బాలచందర్ యోగేశ్వర్ సూచించారు. పశు వికాస్ డేను పురస్కరించుకొని శనివారం మండలంలోని యూజీ పురంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. కత్తిపూడి పుల్లాన్ గ్రామ శక్తి ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు చేశారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, కాలుష్యం బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఎస్.వరలక్ష్మి, గ్రామ సర్పంచ్ నడిగట్ల త్రిమూర్తులు, ఎంపీటీసీ మేడసాని సింహాద్రి, పశువైద్యులు పి.మంజూష, పుల్లాన్ గ్రామ శక్తి బ్రాంచ్ మేనేజర్ చందు, సిబ్బంది తేటకాయల నూకరాజు, గోపాల మిత్ర కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తంటికొండ ఆలయానికి భక్తుల తాకిడి

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో జిల్లా నలుమూలల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయ పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి పంచహారతులు సమర్పించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు 1500 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారని, 250 మంది భక్తులు తలనీలాలు సమర్పించారని ఆలయ ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.



రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్తిపాడులో వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న పండితులు



తంటికొండ వెంకన్న ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ

ప్రత్తిపాడు: స్థానిక తోట కాలనీలోని షిర్డీసాయి మందిరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష తులసి అర్చన, నారాయణ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, తేజోమూర్తుల లక్ష్మీనరసింహమూర్తి సిద్ధాంతి, తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకార సేవ శనివారం ఘనంగా జరిగింది. ఆలయ పండితులు ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వందలాది మంది భక్తుల నడుమ ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధాన ఆలయానికి చేర్చారు. వేద పండితులు యనమండ్ర శర్మ, చిట్టి శివ ఘనపాఠి, రమేష్ ఘనపాఠి, అర్చకుడు యడవిల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా మేరీమాత యాత్ర మహోత్సవం

ప్రత్తిపాడు: స్థానిక మరియగిరిపై ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు కె.చిన్నప్ప ఆధ్వర్యంలో శనివారం మేరీమాత యాత్ర మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, పిఠాపురం, గొల్లప్రోలు తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులు తరలివచ్చారు. ఉదయం స్థానిక ఆర్‌సీఎం చర్చిలో భీమిలి మైనర్ మిషనరీ ఫాదర్ డి.పరంజ్యోతి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం మేరీమాత విగ్రహాన్ని తేరుపై ఉంచి, పుర ప్రదక్షిణ చేపట్టారు. బాణసంచా కాల్పుల నడుమ మేరీమాతను ఊరేగించారు. మరియతల్లి తేరు ఆర్‌సీఎం చర్చి నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, మార్కెట్, ఎంప్లాయీస్ కాలనీ మీదుగా మరియగిరికి చేరుకుంది. అనంతరం దివ్య పూజా బలి మహోత్సవాన్ని నిర్వహించారు. భీమిలి మైనర్ మిషనరీ ఫాదర్ డి పరంజ్యోతి పూజాబలిని సమర్పించారు. ప్రతిఇఒక్కరూ సాటి మానవుని పట్ల కరుణ, ప్రేమతో మెలగాలని సూచించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్ వద్ద జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు మాతా బాపిరాజు ఆధ్వర్యంలోనూ, స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాసరి సత్తిబాబు ఆధ్వర్యంలోనూ యాత్రికులకు పులిహోర, మంచినీరు పంపిణీ చేశారు. ప్రత్తిపాడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు, సెయింట్ జోసెఫ్స్ ఆస్పత్రి సిబ్బంది, మఠకన్యలు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు మరియగిరిపై మేరీమాత తేరు

సుందరమ్మ సత్రం భూములకు వేలం నిర్వహించాలి

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో సుందరమ్మ సత్రం భూములకు వేలం పాటలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం ఆయన రంపయర్రంపాలెంలో విలేకర్లతో మాట్లాడారు. సుందరమ్మ సత్రం భూములకు వేలం పాటలు నిర్వహించి భూస్వాములపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించామన్నారు. అధికారులు ఇటీవల రీ సర్వే నిర్వహించి 79 ఎకరాల సత్రం భూమి ఉందని తెలిపారన్నారు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి సత్రం భూములకు వేలంపాటుల నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శి కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు శనివారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం-1లో గర్భిణులు, బాలింతలకు గ్రామ సర్పంచ్ బొండు రాంబాబు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ప్రభుత్వం గర్భిణుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, గ్రామ సచివాలయ కన్వీనర్లు పంచాది వీరబాబు, నాగులాపల్లి రాంబాబు, మాజీ ఎంపీటీసీ నాగులాపల్లి బాబ్జి, ఉపసర్పంచ్ బర్ల చక్రం తదితరులు పాల్గొన్నారు.



పోతులూరులో గర్భిణులకు వైఎస్సార్ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

అంబులెన్స్ ప్రారంభం

తుని: రోగులకు అత్యవసర సేవలు అందించేందుకుగాను తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి డెక్కన్ కెమికల్స్ సంస్థ సమకూర్చిన అంబులెన్స్‌ను ఆసుపత్రి సూపరింటిండెంట్ స్వప్న శనివారం ప్రారంభించారు. ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం డెక్కన్ కెమికల్స్ సంస్థ ఉచితంగా అంబులెన్స్‌ను అందించిందని ఆమె తెలిపారు. అత్యవసర కేసులను కాకినాడ, విశాఖపట్నం తరలించేందుకు తక్కువ చార్జీతో రోగులకు ఇస్తామన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషితో అంబులెన్స్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, డెక్కన్ కెమికల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



తుని ఆసుపత్రిలో అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ స్వప్న

తుని-కవలపాడు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

తుని రూరల్: తునిలో పెంటకోట రోడ్డు నుంచి కవలపాడు వరకూ ఉన్న ప్రధాన రహదారి నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆ శాఖ నిధులు రూ.59 లక్షలు మంజూరు చేయడంతో 1250 మీటర్ల మేర సిమెంట్ రహదారి నిర్మిస్తున్నారు. ఈ పనులను వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్టు కాంట్రాక్టర్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కుసనం దొరబాబు, గంటా చక్రరావు, వంగలపూడి వాసు, వంగలపూడి జమీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ సత్య నాగేశ్వరరావు, నాయకులు

ఎస్ఎంఎస్ సేవలు శ్లాఘనీయం

ప్రత్తిపాడు: నిరుపేద విద్యార్థులకు 'సదా మీ సేవలో' (ఎస్ఎంఎస్) సంస్థ అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం వద్ద శనివారం ఎస్ఎంఎస్ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం ఎంఈఓ బి.అబ్బాయి, ఏలూరు పంచాయతీ కార్యదర్శి కామరాజు మాట్లాడుతూ దాతలు, ప్రభుత్వం అందించే వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. షిర్డిసాయి జ్యూయలర్స్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి, కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గొందేసి చిరంజీవి, సామాజిక సేవా కార్యకర్త జి.సత్యానందం, శిరసాల మణికంఠ జ్యోతి, వైఆర్‌జీ చైల్డ్ కేర్ ఫెసిలిటేటర్ జి.లక్ష్మి పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఎంఎస్ సంస్థ ప్రతినిధులు

లోక్ అదాలత్‌లో 610 కేసుల పరిష్కారం

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 116 క్రిమినల్ కేసులు, 427 పెట్టి కేసులు వెరసి 610 కేసులను పరిష్కరించినట్టు న్యాయమూర్తి కాటం భాను తెలిపారు. మూడు మనోవర్తి, మరో మూడు గృహహింస కేసులను పరిష్కరించడం ద్వారా బాధితులకు రూ.10 లక్షలు ఇప్పించారు. ఆరు సివిల్ కేసులను పరిష్కరించడం ద్వారా రూ.6.05 లక్షలు, ఒక చెక్‌బౌన్స్ కేసులో రూ.3 లక్షలు కక్షిదారులకు చెల్లింపులు చేయించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలకు పది మంది రుణ ఎగవేత దారుల నుంచి రూ.2.97 లక్షలు తిరిగి బ్యాంకులకు చెల్లించాలని న్యాయమూర్తి కాటం భాను ఆదేశించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, బెంచ్ సభ్యురాలు అవసరాల దేవి, బార్ ప్రతినిధులు పి.నరసింహరావు, సి.పుల్లయ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్తిపాడు లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి కాటం భాను

విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన

గండేపల్లి: విద్యార్థులు సబ్జెక్ట్‌పై పట్టు, నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎస్.సతీష్ రెడ్డి అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో శనివారం కార్పొరేట్ కనెక్ట్-2023 పేరిట పలు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కంపెనీ మేనేజర్లతో ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంపెనీలు విద్యార్థుల నుంచి ఎటువంటి ప్రావీణ్యత, నైపుణ్యాలను ఆశిస్తున్నాయో తెలియజేయటమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకే కార్పొరేట్ కంపెనీల మేనేజర్లను ఆహ్వానించి విద్యార్థులతో ముఖాముఖి ఏర్పాటు చేశామన్నారు. అయా కంపెనీల ప్రతినిధులు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కంపెనీల ప్రతినిధులు వి.పొన్నుస్వామి, హెచ్‌ఆర్ ఎక్స్‌పర్ట టి. ఆరుముగం, ప్రొఫెషనల్ విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హెచ్‌ఆర్ రాణి శక్తి, ఇస్సాక్ పట్టురాజా, హెచ్‌ఆర్‌ఎల్‌టీ పనియప్పన్, ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ప్రముఖ కంపెనీల మేనేజర్లు

పండిట్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో శనివారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. బీజేపీ జిల్లా యువమోర్చ కార్యదర్శి కూరాకుల రాజా ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉమామహేశ్వరరావు, చిత్తులూరి రాజుబాబు, సోమిశెట్టి గోపాలం, మొల్లేటి రమేష్ పాల్గొన్నారు.

జగ్గంపేట: గ్రామంలో పండిట్ దీన్ దయాళ్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సాహితి పబ్లిక్ స్కూల్ ఆవరణలో దీన్‌దయాళ్ చిత్ర పటానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దాట్ల కృష్ణవర్మ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బీజేపీ మండలాధ్యక్షుడు మేకా వీరబాబు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

జగ్గంపేట: గ్రామ శివారు టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.17200 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సీహెచ్ విద్యాసాగర్‌రావు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పర్చుతామని చెప్పారు.

యువకుడికి గాయాలు

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు రాజులకొత్తూరు సమీపంలో శనివారం మోటార్ సైకిల్ అదుపు తప్పి జాతీయ రహదారిపై సెంటర్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చేపూరు శివారు గవరయ్యకోనేరుకు చెందిన లోవరాజుకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు రోడ్డుపై అపస్మారకస్థితిలో ఉన్న యువకుడిని 108 అంబులెన్సులో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు అందకపోవడంతో దీనిపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని రూరల్ ఎస్సై బాలాజీ తెలిపారు.

స్ఫూర్తిప్రదాత థామస్ ఆల్వా ఎడిసన్

గండేపల్లి: విద్యార్థులు థామస్ అల్వా ఎడిసన్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్ సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో శనివారం ఎడిసన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.తొలుత ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థామస్ ఆల్వా ఎడిసన్ 1847న అమెరికాలో జన్మించారని, ఆయన తల్లిదండ్రులు డచ్, స్కాట్లాండ్‌కు చెందిన వారన్నారు. 16 ఏళ్లకే టెలిగ్రాఫ్ ఆపరేటర్ అయ్యారని, ఆటోమేటిక్ టెలిగ్రాఫ్ కోసం ట్రాన్స్‌మీటర్, రిసీవర్లను కనిపెట్టినట్టు తెలిపారు. విద్యుత్ బల్బును కనిపెట్టి ప్రపంచానికి వెలుగులు అందించిన మహనీయుడు ఎడిసన్ అన్నారు. కార్యక్రమంలో డీన్ ఏవీ మాధవరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు.

స్నానాల రేవుల పరిశీలన



ఏలేశ్వరంలో స్నానాల రేవును పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు

ఏలేశ్వరం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఏలేరు కాలువలో వేలాది మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ మేరకు స్థానిక శివాలయం వద్ద ఉన్న బ్రాహ్మణ రేవు, ఇతర స్నానాల ఘాట్‌లను ఆధునీకరిస్తున్నారు. కాగా శనివారం కౌన్సిలర్లు అలమండ చలమయ్య, శిగడం వెంకటేశ్వరరావు, మసిరపు నాగేశ్వరరావు తదితరులు స్నానాల రేవులను పరిశీలించారు. శివరాత్రి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్నానాల రేవులను ఆధునీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు డేగల వెంకటరమణ, కోణాల వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ తొండారపు రాంబాబు, కడిమిశెట్టి వాసు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సత్సంగం

ఏలేశ్వరం: స్థానిక సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సత్సంగం నిర్వహించారు. హిందూ మత, రామాయణం, మహాభారతం, పురాణాల ప్రాముఖ్యతను దయానంద భారతి స్వామి భక్తులకు వివరించారు. సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్, మాతృ శక్తి, దుర్గవాహిని సభ్యులు అన్నవరం దేవస్థానం యాజమాన్యాన్ని కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షులు ఏడీవీ ప్రసాద్, కార్యదర్శి కిరీటిబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు తిరుపతిరావు, ముక్కు సుబ్రహ్మణ్యం మాతృశక్తి ఉపాధ్యక్షులు సీహెచ్ మల్లీశ్వరి, ప్రధాన కార్యదర్శి ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ

ఏలేశ్వరం: స్థానిక దిబ్బలపాలెంలోని స్వామీ దయనంద సరస్వతీ అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు శుక్రవారం పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. మార్స్ కంప్యూటర్స్ నిర్వాహకుడు అడపా దుర్గారావు ముందుగా విద్యార్థులకు అన్నదానం చేశారు. అనంతరం విద్యార్థులకు వీటిని అందజేశారు. తన తల్లి జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ అలమండ దుర్గా వెంకటప్రసాద్, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరీటి, కాపు నాయకులు గోళ్ల నాగేశ్వరరావు, సిరి ఫుడ్స్ అధినేత పెచ్చెటి కృష్ణ, కోరాడ రాజు, తురౌతు గురవయ్య, ఉడతల రమణారావు పాల్గొన్నారు.